

## భట్టిప్రోలు కథలు

మా ఊరి చుట్టుపక్కల అత్తలూరి గోపాలరావుగారికున్నంత పొలం ఎవ్వరికీ లేదు. ఊరు మొత్తం మీద రెండస్తుల మేడ గోపాలరావుగారిదే! ఇంటిముందు ప్రహారీగోడకు పెద్ద ఇనుపగేట్లు, ఆ గేటుకిటూ అటూ వైపు రెండు సింహాలు కాపలా కాస్తున్నట్టు ఉండేవి. అవి రాతిబొమ్మలైనా వాటి కళ్ళకున్న బిలేర్ గోలీలు మెరుస్తూ నిజమైన సింహాల్లాగా పిల్లల్ని భయపెట్టేవి. గేటుకానుకుని ప్రహరీ గోడకున్న రాతి పలక మీద 'అత్తలూరి గోపాలరావు లాండ్‌లార్డ్'అని రాసి వుండేది. మల్లెపువ్వు లాంటి గ్లాస్కో పంచె కట్టి బంగారు రంగు సిల్కు లాల్చీ వేసుకుని గోల్డుఫ్లాక్ సిగరెట్ తాగుతూ బయటికొస్తే.. జనమంతా ఆయన వైపే చూసేవాళ్ళు.

# మా ఊరి మారాజు

## డాక్టర్ నక్కా విజయరామరాజు

గోపాలరావుగారి నల్లరంగు అంబాసిడర్ కారుని రేపల్లె గానీ, గుంటూరుగానీ, తెనాలి గానీ పోవాలంటే బయటికి తీసేవోడు డ్రైవరు ఈసోపు. మా వూరికే కాదు చుట్టుపక్కల ఊర్లలో కారు ఎవరికీ లేదు. ఆ కారు బయటికిరాగానే పిల్లలంతా బిలబిల మంటూ దాని చుట్టూ మూగేవారు. పొలాలు దున్న టానికి ఫెర్గూసన్ ట్రాక్టరుండేది కానీ అదెప్పుడూ పట్టుమని పదిరోజులు పన్జేసింది లేదు. రేడియేటర్ లీకయ్యిందనో, డైనమా ట్రబుల్ అనో దాన్నెప్పుడూ రేపల్లె అంకమ్మ చెట్టు దగ్గరున్న జానీ గారేజీలో వుంచేవాడు ఈసోపు. గోపాలరావు గారి పిల్లలంతా గూడవల్లి హైస్కూల్‌లో చదువుకునే వాళ్ళు మస్తాన్ జట్కా బండిమీద వెళ్ళి. పెద్ద జీతగాళ్ళతో పాటు గొడ్లను కాచుకురావడానికి చిన్న జీతగాళ్ళు, గడ్డి కోసుకురావడానికి, చిన్నా చితకా పనులు చెయ్యడానికి పదిమంది దాకా పనోళ్ళుండేవారు. వీరితోపాటు పొలాలు కాపలా కాయటానికి పొలాల మీదే గుడిసెలేసుకొని ఉండేవారు కాపలాదార్లు .

గోపాలరావుగారికి బక్కోడు, బండోడు అనే ఇద్దరు పెద్ద జీతగాళ్ళుండేవారు. మావూర్లో చిన్నపిల్లల దగ్గర్నుంచి పెద్దోళ్ళ దాకా అందరు వారినలాగే పిలిచేవారు. వాళ్ళ అసలు పేర్లు ఎవ్వరికీ తెలీదు. బండోడి అసలు పేరు వెంకటసుబ్బయ్య. బక్కోడి పేరు వెంకట సుబ్బయ్యే. ఇద్దరి పేర్లు ఒక్కటే కావడం, పిలిచిన ప్రతిసారీ ఇద్దరు పలకడంతో, జబ్బ పుష్టితో బలంగా వుండే పెద్దోడిని 'బండోడని', బక్క పలుచగా వుండే చిన్నోడిని 'బక్కోడని'.. గోపాలరావు గారు పిలుస్తూ వుండేవారు. అప్పట్నుంచి వాళ్ళిద్దరి పేర్లు బండోడు, బక్కోడుగా స్థిరపడిపోయినాయి. వీరిద్దరూ కుడి,ఎడమ భుజాల్లా ఎప్పుడూ ఆయన వెంటే వుండేవారు. చిన్న గుమస్తా శంభుడు రాత కోతల పనిచూస్తుంటే బాయగోడు చిన్నోడు చేలమీద పనులు చేయిస్తూ పెద్ద గుమస్తాగా చెలామణి అయ్యేవోడు!

పొలాల దుక్కులు మొదలైన దగ్గర్నుంచి వరినాట్లేసి, కలుపులు తీసి, కోతలు కోసి కుప్పలు నూర్చే దాకా మా వూర్లో అందరికీ పనులుండేవి. అప్పుడంతగా పనులుండేవి కాదు. అప్పుడప్పుడు అరకొర పనులు తప్ప, ఎండాకాలంలో మట్టి పనులు మగాళ్ళకు మాములే!

గోపాలరావు గారికి మనుషులంటే ఎంత ప్రేమో, మొక్కలన్నా, జంతువులన్నా అంతిష్టం. ఆయన బయట ఊర్లు వెళ్ళినపుడు, నాలుగైదు రకాల మొక్కలు తీసుకొచ్చేవాడు. గుదికట్ట మీద నాటిన ముంతమామిడి, అంటుమామిడి, బర్రి సపోట మొక్కలు జిల్లేపల్లి నుంచి తెప్పించినవే. ఇక గోపాలరావుగారి దొడ్లో ఏదన్నా పూలమొక్క లేదంటే అది మా జిల్లాలో ఎవరింట్లో లేనట్టే లెక్క! అన్ని కాలాల్లో పూసే పూలమొక్కలతో ఆ తోట ఎప్పుడూ సువాసనలు వెదజల్లేది.

ఆయనకి కొత్త పంటలన్నా కూడా చాలా ఇష్టం. మొదటిసారి మా వూళ్ళో అత్తరువడ్లు (బాస్మతి) పండించింది ఆయనే! జపాన్ నాటు పద్ధతిలో ఇద్దరు మనుషులు దమ్ము చేసిన చేలో దిగి చెరో వైపున డొక్కనార తాడు లాగి పట్టుకుంటే దాని వెంట ఆడోళ్ళు నాట్లేసేవారు. అది ఆరునెలల పంట. ఆ నాట్లు చూడడానికి చుట్టపక్కల ఊర్లనుంచి కూడా జనం వచ్చేవారు. ఇంతా చేస్తే ఎకరానికి పండింది మూడు బస్తాల వడ్లే. వాటి బియ్యం అత్తరు వాసన వస్తుందని పులావు వండుకునేవారని జనం తెగ చెప్పుకునేవారు.

ఇంట పుట్టిన కోడె దూడల్ని బాగా మేపి ఎద్దుల

పందాలకు పంపించేవాడు అత్తలూరి గోపాలరావుగారు. ఆయన దొడ్లో పుట్టిన కోడెదూడలకు ఒంగోలు, తెనాలి, గుంటూరులో జరిగిన బండిలాగుడులో,అందాల పోటీల్లో చాలా బహుమతులొచ్చేవి. ఆ బహుమతుల్తో ఆ కోడెదూడల్ని పెద్ద పెద్ద ఫోటోలు తీయించి మేడ ముందు గదిలో ఫ్రేమ్ కట్టించి పెట్టేవారు. వాటిలో తెల్లగిత్త మూడుసార్లు గెలిచి జిల్లాలోనే... ఫస్టు వచ్చింది. ఆ తర్వాత దాన్ని బండి లాగనీయకుండా చావిట్లోనే కట్టేసి.. ఉలవలు, జనపకట్టలతో బాగా మేపేవారు జీతగాళ్ళు.

* * *

మా ఊర్లో జనమంతా ఏదో ఒక పనిలో తీరిక లేకుండా ఉంటే చెత్తోడు, గురకడు, ఆనందు, ఈరయ్య, అనే నలుగురు మాత్రం ఏ పనీ ముట్టుకునేవారుకాదు. రోజంతా పంతగాని పరదేశి ఇంటి ముందో, అంజయ్య గారి చింతదొడ్లోనో, బండతాత కొబ్బరి తోటలోనో చీట్ల పేకాడుతూ గడిపేవారు. వీరికి తోడు అప్పుడప్పుడు ఊర్లోంచి పెద్దబ్బులు, చిల్లర దొంగతనాలు చేసే నారిగోడు కలిసేవారు. గుండేలు సుబ్బడు జిల్లేపల్లి నుంచి తెచ్చే నాటుసారా తాగటం, చిన్నా చితకా దొంగతనాలు చెయ్యడం వీరి పని. తాగుడికి, చీట్లపేకకు ఎంత వరకు అవసరమో అంతే దొంగతనం చేసేవారు.

భట్టిప్రోలుకు కొత్తగా వచ్చిన ఎస్. ఐ.నాయక్ నాటుసారా అమ్మకం మీద నిఘాపెట్టి గుండేలు సుబ్బడిని సారా ట్యూబ్‌తో సహా పెద్దారం డొంక దగ్గర పట్టుకుని మానేపల్లి చెరువుకట్ట మీదున్న పోలీసు స్టేషన్లో పెట్టి మక్కెలిరగ తన్నాడు. ఆ దెబ్బతో వాడు సారా తేవడం టెంపరరీగా మానేశాడు. అప్పట్నుంచి చెత్తోడి గ్యాంగుకి గొంతు తడారిపోయింది. సారా అప్పయ్య కొట్లో కడుపునిండా సారా తాగాలంటే గుండేలు సుబ్బడికిచ్చే డబ్బులకి నాలుగురెట్లు ఇవ్వాల్సివచ్చేది. వీరు చేసే అరకొర దొంగతనాలకు అవి సరిపోయేవి కాదు. బండతాత కొబ్బరితోటలో చీట్ల పేకాడుతున్నారు ఆ నలుగురు.

''ఏదైనా పెద్ద దొంగతనం చేసి ఇబ్బంది లేకుండా బతుకుదాంరా'' అన్నాడు చెత్తోడు. మిగిలిన ముగ్గురూ సరేనన్నారు.

''అయితే ఈ రాత్రికి కొబ్బరితోట'' అన్నాడు గ్యాంగు లీడరు చెత్తోడు బీడిముక్క చివరిదమ్ములాగి పడేస్తూ. మోకులు, గోనె సంచుల్తో బయలుదేరి రాత్రికిరాత్రి ఐదువందలకు పైగా కొబ్బరిబొండాలు దింపి తోకల ఎంకటేసుకి తెలీకుండా ఆయన ఎడ్లబండి జల్లెలో వేసి చెరకుపల్లి చేర్చారు ఆ నలుగురు.

తెల్లారిన తర్వాత దొంగతనం సంగతి తెలిసి తోటకు కాపలా కాసే బండతాత లబోదిబోమని నెత్తీనోరు బాదుకుంటూ గోపాలరావుగారి మేడవైపు పరుగెత్తాడు. నరసరావుపేట పడక కుర్చీలో కూర్చుని ఫిల్టర్ కాఫీని ఇత్తడి గిన్నెలో చల్లార్చుకుంటూ తాగుతూ ఆంధ్రజ్యోతి చదువుతున్నాడయన. బండతాత చెప్పిన సంగతి విని ''హారీ! పిచ్చోడా అది ఉడతల పని అయివుంటుందిరా! మన కొబ్బరితోటలో బోండాలు దింపే ధైర్యం ఎవడికుందిరా?'' అని ఆంధ్రజ్యోతి దినపత్రికలో మళ్ళీ తలదూర్చి, ''ఎందుకన్నా మంచిది యానాది సంజీవతో చెప్పి ఉడతలకి ఉచ్చులు పెట్టించరా'' అన్నాడు.

దొంగతనం గూర్చి ఎవ్వరూ ఆరా తీయక పోవడంతో ఆ నలుగురికి ధైర్యం వచ్చి, వారి పనితనం మీద గురి కుదిరింది.


ఒక్క దొంగతనానికే వారం దాకా ఏమి చెయ్యకుండా గడిచిపోయింది. అమావాస్య రోజున మాచెర్ల చెరువుకట్టమీద కోసిన పందిమాంసం బొడ్డు మీద కురుపోడి రెండో అబ్బాయి బొర్రెంకడు తెస్తే, దోనే ఈరమ్మతో వండించుకుని కడుపు నిండా తిని, పీకల్దాక తాగారు. చిన్నా చితకా దొంగతనాలు మానేసి ఇకనుంచి పెద్ద దొంగతనాలే చేద్దామనుకున్నారు ఆ నలుగురు. కొబ్బరి బోండాలమ్మిన డబ్బులు అయిపోగానే-''ఏం చేద్దాంరా?'' అన్నాడు ఈరయ్య, చెత్తోడి వైపు చూస్తూ.

''ఈ రాత్రికి పైడమ్మ చెరువు''అన్నాడు చెత్తోడు. ఎవడే పని చెయ్యాలో వివరంగా చెప్పి పేకముక్కలు పడేసి బీడి ముక్క వెలిగించాడు.

పైడమ్మ చెరువు ఇరవై ఎకరాల చెరువు. అది గుడిమాన్యం కిందున్నా దాని అజమాయిషీ చూసేది, గుడి జాతర జరిపించేది అత్తలూరి గోపాలరావు గారే!

పైడమ్మ చెరువుకి తూర్పువైపున గుడిసె వేసుకుని కాపలాకాసే పప్పుల వెంకయ్యకి ఫుల్లుగా తాగించాడు ఈరయ్య. కనగాల బుచ్చయ్య నాగేశ్వరావు పురుగుమందుల కొట్లోంచి ఎండ్రిన్ డబ్బా కొనుక్కొచ్చాడు ఆనందు. రాత్రి పన్నెండు గంటలకు పనిలో దిగారు ఆ నలుగురు. చెరువుకు పడమర వైపునున్న ఆకురాతివారి సత్రంలోంచి ఎవరో సన్యాసి నిద్రపట్టక తత్వాలు పాడుకుంటున్నాడు. చాకలి పోతురాజు ఇంటిముందున్న తెల్లకుక్క ముడుచుకుని పడుకుంది. కీచురాళ్ళ ధ్వని తప్ప పురుగు కదలడం లేదు. పూటుగా తాగిన కాపలా మనిషి పప్పుల వెంకయ్య సోయిలో లేడు. గురకడు





బట్టలన్నీ విప్పేసి చిన్న గోచికట్టి ఎండ్రిన్ కొంచెం కొంచెం చల్లుకుంటూ తామరాకులను తప్పించు కుంటూ ఒడ్డుకు రాసాగాడు ఈదుతూ. ఎండ్రిన్ ఘాటుకి ఒళ్ళంతా మంట పుట్టసాగింది. సగం డబ్బాని మధ్యలోనే పడేసి ఒడ్డుకు తొందర తొందరగా ఈదుకుంటూ వచ్చేసరికే బొచ్చెలు, వాలుగలు, మోసులు అతనికన్నా ముందే ఒడ్డుకు నోళ్లు వెళ్లబట్టి రాసాగాయి ఎండ్రిన్ ఘాటుకి. ఆ నలుగురు దొరికినన్ని పెద్ద పెద్ద చేపల్ని గోనె సంచుల్లో నింపి తెల్లారక ముందే రేపల్లె చేపల మార్కెట్టులో అమ్మేశారు.

పైడమ్మ చెరువులో ఎండ్రిన్ చల్లారన్న వార్త గుప్పుమంది. తెల్లారకముందే ఊరి జనమంతా పైడమ్మ చెరువుకట్ట మీదే! చచ్చినవి చావగా బతికున్న చేపల్ని పట్టుకెళ్తున్నారు జనం. ఆ రెండ్రోజులు అందరి ఇళ్ళల్లో చేపల కూరే! చెరువు చుట్టు పక్కల చేపల కంపుకు ముక్కులు పగిలిపోయాయి. ఆ వార్త ఆఘమేఘాల మీద గోపాలరావు గారికి చేరింది. ''ఎండ్రిన్ కాదు, గాడిద గుడ్డూ కాదు. ఇదేదో చేపలకు ఎండాకాలం వచ్చే జబ్బురా! సంక్రాంతికి చేపలు పట్టండిరా అంటే విన్నారు కాదు. అయినా మన చెరువులో ఎండ్రిన్ జల్లే ధైర్యం ఎవ్వడికుందిరా?'' అంటూ చచ్చిన చేపల్ని ఏరించి చెరువుకట్ట తూర్పు పక్కన గోతులు తవ్వించి, వాటిని పూడ్పించి, చుట్టుపక్కల బ్లీచింగ్ పౌడర్ చల్లించారు ఆయన.

''అది చేపలకొచ్చే జబ్బు కాదు దొరా! ఏ దొంగ నా కొడుకులో చెరువులో ఎండ్రిన్ పోశారు దొరా'' అని చెరువుకి కాపలాకాసే పప్పల వెంకయ్య ఎంత మొత్తుకున్నా వినిపించుకోకుండా ''తామర తూడు చెరువంతా అల్లుకుంది. దాన్ని పీకండిరా'' అని చెప్పి గోల్డుఫ్లాక్ సిగరెట్టు వెలిగించి పైడమ్మ గుడివైపు వెళ్ళిపోయాడు గోపాలరావుగారు.

ఈ మధ్యకాలంలో సారా తేవడం మానేసిన గుండేలు సుబ్బడు చెత్తడి గ్యాంగుతోకలిసి వారికి కావాల్సిన బీడీలు, తాగటానికి, తింటానికి ఏమైనా తెచ్చిపెడుతూ వారితోనే ఎక్కువకాలం గడపసాగాడు. నారయ్య, అబ్బులు, అప్పుడపుడొచ్చే అద్దేపల్లి రంగులు, పెద్దారం సైదులు, కనగాల బసవయ్య ఇపుడు రోజూ పేకాటకొస్తున్నారు కొబ్బరితోటలోకి.

ఆ ఏడాది ఎండాకాలం గుడికట్ట మీదున్న గోపాలరావుగారి మామిడితోట విరగ్గాసింది. దాన్ని కాపలాకాసే శ్రీరామశేషయ్యని చూసినా, ఆయన నల్లకుక్క అన్నా భయపడి మామిడితోట చుట్టపక్కల కెళ్ళేవారు కాదు జనం. ఆ నల్లకుక్క గానీ కాలిపిక్క పట్టుకుంటే కండ ఊడిరావాల్సిందే. శేషయ్య బాణాకర్ర దెబ్బతిన్న వాడెవడైనా ఆ చుట్టపక్కలకు మళ్ళీ తిరిగి చూడడు. గుడికట్ట మామిడితోటతో బంగినపల్లి,మామిడితోటలో బంగినపల్లి, ముంత మామిడి, చిన్నరసాలు, చెరకురసాలు, పచ్చడి కాయలతో కొమ్మలు విరిగిపోయేలా ఉన్నాయి. లంకబీడులో కల్లుతాగి వస్తున్న చెత్తోడు మామిడితోటను చూసి ఆ సంగతి ఆనందు, గురకడు, ఈరయ్యలతో చెప్పాడు. ఆ సాయంత్రం శేషయ్యకు అప్పయ్యకొట్లో పూటుగా తాగించాడు ఆనందు. సపోటా చెట్టు కింద నిద్రపోతున్న నల్లకుక్కని గోనె సంచిలో కట్టేసి యానాదుల దిబ్బమీద వదిలేసి వచ్చాడు గురకడు. ఆ రాత్రి మామిడితోటను దులిపి పారేశారు ఆ నలుగురు. కాయల్ని గోనె సంచుల్లో వేసుకుని తెల్లారేసరికల్లా పొన్నూరు మార్కెట్టులో అమ్మేశారు.

ఆ తెల్లారి మత్తు దిగి తోటకెళ్ళి చూస్తే ఒక్క కాయ లేదు. లబోదిబోమని గోపాలరావుగారింటికి పరిగెత్తాడు శ్రీరామశేషయ్య.

''దొంగలు పడి తోటలోని మామిడి కాయల్ని కోసేశారు దొరా'' అంటే

''హారీ పిచ్చోడారాత్రి గాలి దుమారం వచ్చి కాయలు రాలిపోయి ఉంటాయిలేరా! మన మామిడి తోటలో కాయలు తెంపడానికి ఎవరికుందిరా ధైర్యం ఈ ఊర్లో? అయినా నీ నల్లకుక్క ఉండంగా ఆ చుట్టు పక్కలకి ఎవరన్నా రావడానికి ధైర్యం యాడిదిరా?'' అంటూ ''కుక్కను సరిగ్గా చూసుకో'' అని చెప్పి గోల్డ్‌ఫ్లాక్ సిగరెట్ కాలుస్తూ మేడమీదికి వెళ్ళిపోయారు గోపాలరావుగారు. రెండోరోజుకి గానీ నల్లకుక్క ఇంటికి చేరలేదు. దానికేమైందో ఆ రెండ్రోజులు ఎక్కడికి పోయిందో ఎంత తల బాదుకున్నా శేషయ్యకి అర్థం కాలేదు.

* * *

ప్రతి ఏడాది వైశాఖ పున్నమికి ఊరి గుడి తిరణాళ్ళు వారం రోజులపాటు బ్రహ్మాండంగా చేసేవారు గుడి ధర్మకర్త గోపాలరావుగారే! గుడి మాన్యం మీదొచ్చినదంతా తిరణాళ్ళకి ఖర్చుపెట్టే వారు. ఆ వారం రోజులు మావూరు నాటకాలు, రంగుల రాట్నాలతో, చెక్కబొమ్మలు, మిఠాయి దుకాణాలతో 'చిన్న బొంబాయి' అయిపోయేది. చుట్టుపక్కల పదహారు ఊళ్ళ జనం మా ఊర్లోనే వుండేవారు. రథం ఊరేగింపుకి కరెంట్ తీగలు అడ్డమని కరెంటు తీసేసి సర్వీసు వైర్లని పీకేశారు. కనగాల లక్ష్మి టాకీసు నుంచి (ఆ సినిమా హాలు గోపాలురావు గారిదే) జనరేటర్ తెప్పించి ఇరవైదాకా ట్యూబ్‌లైట్లు, కర్రలకు కట్టి ఊరేగింపు ముందు నడుస్తున్న గోపాలరావు గారి జీతగాళ్ళు, బండోడు, బక్కోడు రథానికి చెరోక పక్కన నడుస్తు రథం చక్రం దగ్గరికి జనాన్ని రాకుండా చూస్తున్నారు.

కొంచెం దూరం రథం మోకు లాగి, గోపాలరావు గారింటికెళ్ళిపోయారు. ఊరేగింపుకి ఇసకేస్తే రాలనంతా జనం వచ్చారు. దుకాణాలన్నీ సందడి సందడిగా వున్నాయి. లోన బయట పేకాట దగ్గర చేరిన 'ఆ నలుగుర్ని' చూశాడు బండోడు జనం మధ్యలోంచి, అదే విషయం బక్కోడి చెవిలో ఊదాడు. ''ఎందుకన్నా మంచిది ఒక కన్నేసి వుంచుదాం'' అన్నాడు బక్కోడు. జనం రథం మోకు లాగడానికి పోటీపడుతున్నారు. ఊరేగింపు లైబ్రరీ దగ్గరొకసారి, సీతయ్య కొట్టు దగ్గరొకసారి ఆగింది. భక్తులు అరటిపళ్ళు, కొబ్బరికాయలు పూజారికందించి, విగ్రహాలకు హారతులిచ్చి కళ్ళకద్దుకుంటున్నారు. ఊరేగింపు ముందు నడుస్తూ పేటేరు టపాకాయలు పేలుస్తున్నాడు గుడ్డి సాంబయ్య. రథం మీద నిలబడి రథం వేగం తగ్గించండి. ఈ పక్కకి, ఆ పక్కకి లాగండి, జనం చక్రాల దగ్గరకు రావద్దని మైకులో ఆపకుండా చెబుతూనే ఉన్నాడు వంగర రామస్వామి. ఊరేగింపు షావుకారు పిచ్చయ్య గారి ఇంటి నుంచి గౌండ్ల ఇళ్ళ మీదుగా తిరిగి గుడి దారిపట్టింది, జనం పల్చబడసాగారు. రథం గుడికి చేరేసరికి మోకులు లాగేవారు, లైట్లు మోసేవాళ్ళు, సన్నాయి మేళగాళ్ళు, కాగడాలు పట్టుకున్నవారు, పూజారి, బండోడు, బక్కోడు తప్ప ఎవ్వరు మిగలలేదు.

పూజారి రాంబ్రహం విగ్రహాలను గుళ్ళో పెట్టి తాళం వేసి ఇంటికెళ్ళిపోయాడు. మిగిలిన వాళ్ళు ఎవరి ఇళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయారు. కరెంటు లేక చీకటిగా ఉంది గుడి ముందు. దుకాణాలు కూడా మూసేశారు.

బండోడు, బక్కోడు బీడీతాగుతూ గుడి ముందు మెట్ల మీద కూర్చున్నారు. గుడి ఆవరణలో పున్నాగ చెట్టుకింద చీకట్లో ఏవో ఆకారాలు తచ్చాడినట్టు కనబడ్డాయి బక్కోడికి. అవి బయటికొచ్చే దాకా గుడి గేటు పక్కనే మాటేసి, ఆ ఆకారాలు బయలికి రాబోతున్నప్పుడు వాటిపైకి దూకి రథం మోకుతో కట్టేసి గోపాలరావుగారి గొడ్ల చావిట్లో పడేసి ఎముకల్లో సున్నం లేకుండా దంచిపారేశారు వారిని బండోడు, బక్కోడు. తెల్లారేసరికి శివాలయంలో విగ్రహాలు నగలతో పాటు దొంగలెత్తుకెళ్తుంటే బండోడు, బక్కోడు పట్టుకున్నారనే వార్త ఊరంతా పాక్కింది. జనమంతా గోపాలరావుగారి మేడ ముందు మూగారు. మేడమీద ప్రాంతీయ వార్తలు వింటున్న గోపాలరావుగారు వరండాలో కొచ్చి జనాన్ని చూసి కిందకు దిగొచ్చాడు. దొంగల్ని చూద్దామని జనం తెగ తోసుకుంటున్నారు. బండోడు, బక్కోడు ఒక్కొక్క గోనె సంచి బయటికి మోసుకొచ్చారు. నాలుగు సంచులు తెచ్చిన తర్వాత, ఒక్కో దాని మూతి విప్పసాగారు. మొదటి దాంట్లో నుంచి ఈరయ్య బయటికొచ్చాడు. రెండో దాంట్లోంచి ఆనందు, మూడోది గురకయ్య, చివరిగా చెత్తోడు. జనం ముక్కు మీద వేలేసుకున్నారు ఆ నలుగుర్ని చూసి. వీరిని వదలొద్దు..పోలీసులకు అప్పచెప్పండి అంటూ అరుస్తున్నారు కొందరు. దేవుడి నగలు దొంగతనం చెయ్యడం పాపం కదూ, కళ్ళుపోతాయి అన్నారు అక్కడ గుమిగూడిన ఆడవాళ్ళు. చివరిగా జనమంతా బండోడ్ని, బక్కోడ్ని తెగ మెచ్చుకున్నారు.

ఆ నలుగురు గోపాలరావుగారి కాళ్ళమీద పడ్డారు క్షమించమన్నట్టు. వారిలో ఏ ఒక్కరికి ఏ అవయవము సరిగ్గా పనిచేయడం లేదు. మాటా పలుకు కూడా అంతంతమాత్రమే! వారి పరిస్థితి చూసిన గోపాలరావుగారి గుండె కరిగిపోయింది. బండోడ్ని, బక్కోడ్ని చెడామడ తిట్టి నల్లచారిని, ఎర్రచారిని ఉన్న ఫళంగా పిలిపించి ఇంజక్షన్లు, పసరకట్లు వేయించారు. ఆ నలుగురిని అక్కడే గొడ్లచావిడి పక్కనున్న స్టోరు గదిలో వుంచి జీవాల కోటయ్యతో వేటమాంసం, కాళ్ళు, తలకాయ మాంసం తెప్పించి మూడుపూటలా దెబ్బలు నయమయ్యేదాకా పెట్టించాడు. ఐదో రోజుకి కూర్చుని, ఏడో రోజుకి నిలబడి, పదిరోజులకు కొంచెం నడువ సాగారు వాళ్ళు. ఇంజక్షన్లు, బిళ్ళలు, పసరకట్లు.. రోజూ క్రమం తప్పకుండా వచ్చి ఇచ్చేవారు ఎర్రచారి, నల్లాచారి గారు.

పదోరోజు సాయంత్రం పక్షులు గూటికి చేరేవేళ, ఆ నలుగురికి అప్పుడే పితికిన పాలు మనిషికొక లోటా ఇస్తున్నాడు బక్కోడు. పెద్ద మాళీగేదె పాలు పితుకుతున్నాడు బండోడు. సుధాకర్ పూలతోటలో మొక్కలకు నీళ్ళు పోస్తున్నాడు. మళ్ళీ ట్రాన్సిస్టర్ రేడియోలో వ్యవసాయదారుల కార్యక్రమం వింటూ అక్కడికొచ్చిన గోపాలరావు గారిని చూడగానే ఆ నలుగురు ఆయన కాళ్ళమీదపడి కొబ్బరిబొండాల దగ్గర్నుంచి మామిడి కాయల దాకా తాము చేసిన దొంగతనాలన్నీ ఒప్పుకుని.. జీవితంలో ఇంకెప్పుడూ దొంగతనాలు చెయ్యమని ఒట్టేసుకుని.. గుండెలు పగిలేలా ఏడ్చారు.

గోపాలరావుగారి గుండె కరిగిపోయింది.

''పేకాట, దొంతనాలు, తాగుడు మానేసి బుద్ధిగా పని చేసుకుని బతకండి పొండి'' అని చెప్పి ట్రాన్సిస్టర్ రేడియో తీసుకుని మేడమీదకెళ్ళిపోయారు. మల్లె, సంపెంగ, జాజి, పారిజాతం పూలతో తోటంతా గుభాళిస్తోంది. పైరగాలి ఆ సువాసన దివాణం అంతటా వ్యాపింపచేస్తోంది. గోపాలరావుగారి భార్య సుభద్రమ్మగారు, ఆయన చిన్న కూతురు బుజ్జమ్మ తోటలో తిరుగుతూ అపుడే పూసిన జినియా పువ్వుల్ని చూస్తున్నారు. చిన్న జీతగాడు సుధాకర్ పూలమొక్కలకు నీళ్ళుపోస్తూ పాదులు తవ్వుతున్నాడు. బక్కోడు మాళీ గేదెను కుడితెకు తీసుకెళ్తున్నాడు. మేడ మీద వార్తలు వింటూ పచార్లు చేస్తూ, కిందకు చూస్తున్నారు గోపాలరావుగారు.

పశువుల కొట్టం పెద్ద గేటు వైపుకు ఆ నలుగురు మెల్లగా నడుచుకుంటూ పోతున్నారు. సరిగ్గా నడవలేక చెత్తోడు కుంటుతున్నాడు.

''దెబ్బలు పూర్తిగా తగ్గినతర్వాత ఈ నలుగుర్ని పనిలో పెట్టుకోమని బాయగోడి చిన్నోడితో చెప్పాలి, వీలయితే మిగిలిన కూలీలకన్నా కొంచెం ఎక్కువ కూలీ ఇచ్చే ఏర్పాటు చెయ్యాలని'' అనుకుంటూ వారినే చూడసాగాడు ఆయన. చివరగా నడుస్తున్న ఈరయ్య వెనక ఏదో పాకుతున్నట్లు నీడలా కన్పించింది. సంజె చీకట్లో సరిగ్గా కనిపించడం లేదు. సన్నగా పొడువుగా వున్న దాన్ని చూసి.. ఏదో పాము అనుకుని ''ఈరయ్య వెనక పాము పోతోంది దాన్ని చంపండిరా'' అంటూ గోపాలరావుగారు మేడ మీదనుంచి పెద్దగా కేక వేసే సరికి- చేసే పనులు వదిలేసి కర్రలు తీసకుని ఈరయ్య వెనకపడ్డారు, బండోడు,బక్కోడు, సుధాకర్.

వీరిని చూసి పరుగు లంకించుకున్నాడు ఈరయ్య. చివరకు పెద్ద గేటు దగ్గర దొరికాడు ఈరయ్య. రొప్పుకుంటూ ఆదరాబాదరాగా కిందకు దిగొచ్చిన గోపాలరావుగారు ''త్రాచుపామా? జెర్రిపోతా? దొరికిందా? పారిపోయింది? ఎందుకయినా మంచిది మంత్రాల పంతులు గారిని పిలచి మంత్రం వేయించండిరా''అన్నాడు కంగారుపడుతూ.

''త్రాచుపాము, జెర్రిపోతు కాదు దొరా! మన పెద్ద గేదెను కట్టేసే పలుపుతాడు సాగనారా ఎవరూ చూడకుండా కుడికాలి వేలికి చుట్టుకుని లాక్కెల్తున్నాడు వీడు. మీరెన్ని మంచి మాటలు చెప్పినా వీడి దొంగ బుద్ధి మారిందేమో చూశారా దొరా?'' అంటూ సాగనార పలుపుతాడుతో ఈరయ్యను నాలుగు బాదాడు బండోడు. ఈరయ్య భయంతో వణికిపోతు గోపాలరావు గారి కాళ్ళమీద పడ్డాడు.

సానుభూతిగా ఈరయ్య వంక చూసి గోల్డుఫ్లాక్ సిగరెట్టు వెలిగించి పూలతోట వైపు వెళ్ళిపోయారు అత్తలూరి గోపాలరావుగారు.

★